సాక్షి మంచిర్యాల

సోమవారం । 17 । జూలై । 2023



నస్పూర్‌లో బోనమెత్తిన ఎమ్మెల్యే దివాకర్‌రావు

మైసమ్మకు మొక్కులు..



గాంధారి మైసమ్మ ఆలయానికి బోనాలతో ఊరేగింపుగా తరలివస్తున్న భక్తులు



నస్పూర్‌లో శివసత్తుల పోతరాజు విన్యాసాలు



ప్రత్యేక అలంకరణలో గాంధారి మైసమ్మ తల్లి

రామకృష్ణాపూర్/నస్పూర్: ఆషాఢమాసం చివరి ఆదివారం సందర్భంగా జిల్లాలో గ్రామ దేవతలకు పోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. శక్తి స్వరూపిణి అయిన అమ్మవార్లకు బోనాలు తీశారు. ఆదిపరాశక్తి నైవేద్యం సమర్పించి పూజలు చేశారు. మైసమ్మకు కోళ్లు, మేకలు బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. మందమర్రి మండలం బొక్కలగుట్టలో గాంధారి మైసమ్మ జాతర వైభవంగా జరిగింది. డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాల నడుమ భక్తులు బోనాలతో ఆలయానికి తరలివచ్చారు. అమ్మవారికి పూజలు చేశారు. నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అక్కడే వంటలు చేసుకుని భోజనాలు చేశారు. అమ్మవారి అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మందమర్రి, మంచిర్యాల ప్రాంతంతోపాటు కోల్‌బెల్ట్ పరిసర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. నస్పూర్ పట్టణంలోని శ్రీ ఆదిపరాశక్తి భువనేశ్వరిమాతకు భక్తులు బోనాలు సమర్పించారు. సీసీసీ కార్నర్ నుంచి బోనాలతో రాంనగర్‌లోని అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ఆదిపరాశక్తికి బోనాలు సమర్పించి పూజలు చేశారు. మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, డీసీపీ సుధీర్‌రాంనాథ్ కెకాన్, ఆర్డీవో వేణు, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పుస్కూరి రామ్మోహన్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెర్రబెల్లి రఘునాథ్ తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. డీసీపీ రాంనాథ్ కెకాన్, మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 200 పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మంచిర్యాలకు చెందిన ధర్మరాజు హాస్పిటల్, హైలైఫ్ హోటల్స్ యాజమాన్యం భక్తులకు ఉచిత మంచినీరు, మజ్జిగ సౌకర్యం కల్పించారు.

ఎంసీసీ కథ ముగిసినట్లే!



ఎంసీసీ కంపెనీ ముఖ ద్వారం..



విద్యుత్ బకాయిలు చెల్లించలేదంటూ ఆస్తుల అటాచ్ చూపే నోటీసు

- పేరుకుపోతున్న సంస్థ బకాయిలు
- కంపెనీ ఆస్తుల అటాచ్
- ఉత్పత్తి పునరుద్ధరణ ఆశలపై నీళ్లు
- భూములను అమ్మే కుట్రగా కార్మికుల ఆవేదన

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఎంసీసీ(మంచిర్యాల సిమెంట్ కంపెనీ) పునరుద్ధరణ ఆశలు సన్నగిల్లుతున్నాయి. వందలాది మందికి ప్రత్యక్ష, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి కల్పించి గతంలో ఓ వెలుగు వెలిగిన కంపెనీ పునరుద్ధరణ అవకాశాలు కనుమరుగవుతున్నాయి. నాటి ఏసీసీ(అసోసియేటెడ్ సిమెంట్ కంపెనీ), ప్రస్తుత ఎంసీసీ కనీసం విద్యుత్ బకాయిలు సైతం చెల్లించలేక ఆస్తుల అటాచ్‌మెంట్‌స్థాయికి పడిపోయింది. ఇటీవల రూ.10.36 కోట్ల బిల్లులు పెండింగ్ ఉన్నాయని, సంస్థ ఆస్తులను రెవెన్యూ రికవరీ చట్టం కింద విద్యుత్ శాఖ అటాచ్ చేసింది. ఇప్పటికే కంపెనీ యంత్ర సామగ్రి తుప్పు పట్టడంతో స్క్రాప్ కింద అమ్మేశారు. ఇక కార్మికులను పూర్తిగా తగ్గించుకుని, కంపెనీ పూర్తిగా దివాళా తీసింది. చివరకు కార్మికులే ఆ కంపెనీపై ఆశలు వదులుకునే పరిస్థితి ఏర్పడింది. మూడేళ్లుగా కంపెనీలో ఉత్పత్తి పునరుద్ధరించాలని కార్మిక సంఘాలు కోరుతున్నా యాజమాన్యం పట్టించుకోలేదు. కరోనాకు ముందు మళ్లీ ఉత్పత్తి ప్రారంభిస్తామని చెప్పినప్పటికీ ఆ దిశగా అడుగులు పడకపోగా, రోజురోజుకు కంపెనీ పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడుతోంది.

రోడ్డున పడ్డ కార్మికులు

జిల్లా కేంద్రం నడిబొడ్డున ఉన్న కంపెనీకి స్థానికంగా, కాగజ్‌నగర్, జన్నారం మండలాల్లో కలిపి 184 ఎకరాల భూమి ఉంది. సిమెంట్ ఉత్పత్తి యంత్రాలు, క్వారీ నుంచి ప్రత్యేక రోప్ లైన్, క్వార్టర్లు, భవనాలు, తదితరాలు కలిపితే రూ.వందల కోట్ల విలువ ఉంటుంది. 2004లో కంపెనీ పాత యాజమాన్యం నుంచి మంచిర్యాలకు చెందిన వ్యాపారులు కొనుగోలు చేశాక పరిస్థితి పూర్తిగా మారిపోయింది. 1956లో ఏసీసీ ఆరంభంలో 1,200 మంది వరకు కార్మికులు ఉండగా, యాజమాన్యం మారే నాటికి 438 కార్మికులు ఉన్నారు. నష్టాలు వస్తున్నాయంటూ, కొంత కాలం తర్వాత క్రమంగా వారి సంఖ్య తగ్గించుకుంటూ పోయింది. కంపెనీ మూత పడినప్పటికీ జీతాలు అందక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోరాటం చేస్తే కొన్నాళ్లకు కొంత మేర బకాయిలు చెల్లించారు. తర్వాత పట్టించుకోకపోవడంతో కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగింది. చివరకు పదుల సంఖ్యలో కూడా పని చేస్తున్నవారు లేరు. జీతాలు లేక మూడేళ్ల క్రితమే కాంట్రాక్టు ఉద్యోగులు మానేశారు. మిగిలిన వారిని కూడా ఎంతోకొంత ఇచ్చి బలవంతంగా ఉద్యోగ విరమణ చేయించారు. ఇంకా కొందరు తమకు న్యాయం చేయాలని కార్మిక శాఖ నుంచి పోరాటం చేస్తున్నారు.

ముగిసిన అధ్యయమేనా?

70 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగి, దేశంలో నాణ్యత గల 43 గ్రేడ్ సిమెంట్‌ను ఉత్పత్తి చేసిన ఎంసీసీ(ఏసీసీ) జిల్లా పారిశ్రామిక చరిత్రలో ఇక ముగిసిన అధ్యయమేనని భావిస్తున్నారు. ఎన్ని నిరసనలు, పోరాటాలు చేసినా యాజమాన్యం కంపెనీని తిరిగి ప్రారంభించేందుకు ముందుకు రావడం లేదు. అమ్ముకునే దిశగా ప్రణాళిక వేస్తోందని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే హై టెక్ సిటీ కాలనీగా రియల్ ఎస్టేట్ కింద భూములు అమ్మేశారు. కరెంట్, బ్యాంకు రుణాలు, ఇతర పన్నుల చెల్లింపులు, కార్మికుల జీతాలు చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తోంది. ఇక కంపెనీ క్వార్టర్లను ప్రైవేటు వ్యక్తులకు అద్దెకు ఇస్తోంది. కంపెనీ యంత్రాలు పూర్తిగా పనికి రాకుండా తుప్పుపట్టిపోయాయి. మొత్తం మిషనరీ కొత్తగా బిగిస్తే తప్ప పనిచేసే పరిస్థితి లేదు. క్వారీలో ఇంకా 30 నుంచి 40 ఏళ్లకు సరిపడా సున్నపురాయి నిల్వలు ఉన్నా.. వినియోగించుకునేందుకు యాజమాన్యం ముందుకు రావడం లేదు. జిల్లా ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చొరవతో కంపెనీ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కార్మికులు, జిల్లా ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి



ఎంసీసీ యాజమాన్యం తీరుతో కార్మికులు ఎంతగానో నష్టపోయారు. దీనిపై కార్మికు శాఖకు ఫిర్యాదు చేశాం. యాజమాన్యం కంపెనీ భూములను రియల్ ఎస్టేట్ చేయాలనే కుట్రను అందరూ అడ్డుకోవాలి. కంపెనీ ఆస్తులను సర్కారు స్వాధీనం చేసుకుని న్యాయం చేయాలి.

– గాజుల ముఖేశ్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడు. ఎంసీసీ కార్మిక సంఘం

మృతదేహం వెంటే మృత్యు ఒడికి..



రోదిస్తూ అంత్యక్రియలు నిర్వహిస్తున్న పిల్లలు, కుటుంబీకులు

- క్షణికావేశంలో పురుగుల మందు తాగిన భార్య
- చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి
- మృతదేహాన్ని తీసుకెళ్తుండగా భర్తను ఢీకొట్టిన లారీ
- రెండు గంటల వ్యవధిలో దంపతుల మృత్యువాత
- అనాథలైన ఇద్దరు పిల్లలు..

లక్సెట్టిపేట: కడవరకూ తోడుంటానని పెళ్లిలో చేసిన ప్రమాణాన్ని దేవుడు నిజం చేయాలనుకున్నాడో ఏమో.. పిల్లలు చిన్నవారన్న దయ కూడా చూపలేదు. భార్య చనిపోయిందని పుట్టెడు దుఃఖంలో ఆమె మృతదేహం వెంటే స్వగ్రామానికి బయల్దేరాడు భర్త. తెల్లవారితే పిల్లలకు అమ్మ ఏదంటే ఏమని సమాధానం చెప్పాలని ఉబికి వస్తున్న కన్నీళ్లను ఆపుకుంటూ.. తనలోని బాధ పిల్లలకు కనిపించకూడదన్న ఆలోచనలో ఉన్నాడు. ఇంతలోనే మృత్యువు వెంటాడింది. భార్య చనిపోయిన రెండు గంటల వ్యవధిలోనే లారీ రూపంలో అతడిని కబళించింది. ఈ విషాద సంఘటన లక్సెట్టిపేట మండలంలో చోటు చేసుకుంది. తల్లిదండ్రుల మరణంతో పదేళ్లలోపు ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. ఈ ఘటనతో మండలంలోని ఎల్లారం గ్రామంలో విషాదం అలుముకుంది.

చిచ్చుపెట్టిన పొరుగింటి గొడవ..

డ్రైవర్‌గా పనిచేసే భర్త, బంగారం లాంటి ఇద్దరు పిల్లలతో హాయిగా సాగిపోతున్న ఆమె జీవితంలో పొరుగింటి వారితో జరిగిన గొడవ ఆ కుటుంబంలో చిచ్చు పెట్టింది. చివరకు దంపతులిద్దరి మరణానికి కారణమైంది. లక్సెట్టిపేట ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎల్లారం గ్రామానికి చెందిన శరణ్య(28) గృహిణి. ఆమె భర్త మల్లికార్జున్(33) ప్రైవేటు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వీరికి ఓంకార్, ఇవాంక సంతానం. సాఫీగా సాగుతున్న వీరి కుటుంబంలో ఒక్కసారిగా పెను విషాదం నెలకొంది. కొద్ది రోజుల క్రితం ఇంటి పక్కన ఉండే రజినితో శరణ్యకు గొడవ జరిగింది. ఇరుగుపొరుగు వారు వచ్చి ఇద్దరికీ నచ్చజెప్పారు. ఇంతలో మరో మహిళ రాణి గొడవలో జోక్యం చేసుకుంది. రజినిని రెచ్చగొట్టి స్థానిక పోలీస్ స్టేషన్‌లో శరణ్యపై ఫిర్యాదు చేయించింది.

మనస్తాపంతో పురుగుల మందు తాగి..

ఈ విషయం తెలిసిన శరణ్య మనస్తాపం చెందింది. చేయని తప్పుకు తనపై పోలీసులకు ఫిర్యాదు చేశారని మదన పడింది. క్షణికావేశంలో ఇంట్లో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబీకులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శరణ్య శనివారం రాత్రి 11 గంటలకు మృతిచెందింది. కోలుకుని ఇంటికి వస్తుందనుకున్న భార్య కానరాని లోకాలకు వెళ్లడంతో మల్లికార్జున్ కన్నీటిపర్యంతమయ్యాడు. అనంతరం తేరుకుని మృతదేహాన్ని స్వగ్రామం తరలించేందుకు బంధువు సాయంతో అంబులెన్స్ ఏర్పాటు చేశాడు.

రెండు గంటల వ్యవధిలో ఇద్దరు మృతి..



భార్యభర్తల మృతదేహాలను వాహనంలో తీసుకెళ్తూ..

రెండు గంటల వ్యవధిలో భార్య శరణ్య, భర్త మల్లికార్జున్ మృత్యువాత పడడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. తల్లి మరణంతో పిల్లల గురించి ఆలోచిస్తూ వెళ్లిన తాను కూడా పిల్లలను చూడకుండానే దుర్మరణం చెందడంతో బంధువులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇద్దరికీ లక్సెట్టిపేట ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాలను స్వగ్రామానికి తీసుకెళ్లారు. అమ్మా, నాన్న ఇద్దరినీ విగత జీవులుగా చూసిన పిల్లలు బోరున విలపించడం అందరినీ కలచివేసింది. సాయంత్రం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటనలపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణారెడ్డి తెలిపారు.

అంబులెన్స్ వెనకాలే.. ద్విచక్రవాహనంపై..

అమ్మ త్వరలోనే ఇంటికి వస్తుందని రాత్రి పడుకునే ముందే పిల్లలకు చెప్పాడు మల్లికార్జున్. ఇంతలో శరణ్య మరణించడంతో తెల్లవారి పిల్లలకు ఏం చెప్పాలని దుఃఖాన్ని దిగమింగుతూ తన ద్విచక్రవాహనంపై బంధువుతో కలిసి అంబులెన్స్ వెనకాలే గ్రామానికి బయల్దేరాడు. పిల్లలు రేపటి నుంచి ఎవరిని అమ్మ అని పిలుస్తారని కన్నీరు పెట్టుకున్నాడు. ఈ క్రమంలో అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో లక్సెట్టిపేటలోని ఎన్టీఆర్ చౌరస్తాకు చేరుకున్నారు. మూత్రవిసర్జన కోసం అక్కడ ఆగారు. ద్విచక్రవాహనం రోడ్డు పక్కన నిలిపారు. మల్లికార్జున్ రోడ్డు దాటుతుండగా రాయపట్నం నుంచి లక్సెట్టిపేట వైపునకు వస్తున్న లారీ వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. అక్కడే ఉన్న బంధువు వెంటనే పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు.

పారిశుధ్య పనులను అడ్డుకున్న కార్మికులు



ట్రాక్టర్‌ను అడ్డుకుంటున్న పంచాయతీ కార్మికులు

నెన్నెల: రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం పది రోజులుగా సమ్మె చేస్తున్నారు. ఇందులో భాగంగా నెన్నెల మండలం నందులపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ బోయిని మల్లేశ్, కార్యదర్శి పద్మనాభం, పాలక మండలి సభ్యులు తాత్కాలిక కార్మికులతో ఆదివారం పారిశుధ్య పనులు చేపట్టారు. విషయం తెలుసుకున్న గ్రామపంచాయతీ కార్మికులు అడ్డుకున్నారు. పంచాయతీ ట్రాక్టర్‌కు అడ్డంగా నిలబడి తమకు న్యాయం జరిగే వరకు సమ్మెకు సహకరించాలని కోరారు. కరోనా సమయంలో తమ ప్రాణాలను లెక్క చేయకుండా పారిశుధ్య పనులు చేశామని తెలిపారు. ఎవరైనా సమ్మెకు ఆటంకాలు కలిగించాలని చూస్తే వారి ఇంటిముందు ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ విషయంలో అధికారులు జోక్యం చేసుకొని తాత్కాలిక సిబ్బందిని ఏర్పాటు చేస్తే సహించేది లేదన్నారు. పనులు చేసేందుకు వచ్చిన తాత్కాలిక సిబ్బందిని పంచాయతీ కార్మికులు అడ్డుకోవడంతో వాగ్వాదం జరిగింది. కార్యదర్శి, సర్పంచ్ ఇరువర్గాలను సముదాయించారు.

మందమర్రిలో అష్టావధానం

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలో సంతోషిమాత జ్ఞాన మందిరంలో ఆధ్వర్యంలో ఆదివారం అష్టావధానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా శతావధాని, తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మారెపల్లి వెంకటరమణ పట్వర్ధన్ హాజరయ్యారు. ఎనిమిది మంది కవులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. జీవిత సత్యాలన్ని తెలియజేశారు. అనంతరం శతావధాని దంపతులను జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, ఏరియా జీఎం మోహన్‌రెడ్డి దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు సత్యనారాయణ, చంద్రశేఖర్, కొంపెల్లి రమేశ్ సన్మానించారు.

బీసీ జనగణన చేపట్టాలి

పాతమంచిర్యాల: బీసీ జనగణన సత్వరగా చేపట్టాలని స్థానిక ఐబీ చౌరస్తాలో బీసీ ఐక్య సంఘాల నాయకులు ఆదివారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీసీ జనాభా లెక్కలు సేకరిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం అగ్రవర్ణాలకు ఒత్తిళ్లకు తలొగ్గి బీసీ జనగణన చేపట్టడం లేదని విమర్శించారు. బీసీల జనాభ లెక్కలు తేలితేనే రిజర్వేషన్లు, ఇతర సంక్షేమ ఫలాల విషయంలో బీసీ ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. బీసీ జనగణన కేంద్ర ప్రభుత్వమే చేపట్టాలని సుప్రీం కోర్టు ఆదేశించిందన్నారు. 1931 జనాభా లెక్కల ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్లను 27 శాతంగా నిర్ణయించిందని తెలిపారు. బీసీలు ఉద్యమించి బీసీ జనగణన సాధించుకోవాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక కన్వీనర్ వడ్డేపెల్లి మనోహర్, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, బీసీ సంఘాల నాయకులు ముఖేష్‌గౌడ్, కనుకుంట్ల మల్లయ్య, తులా మధుసూధన్, ఎండీ.ఇబ్రాహీం, కర్రె లచ్చన్న, సత్యనారాయణ, నరేశ్, అంజయ్య, సుదర్శన్, చంద్రమౌళి, తిరుపతి, శంకరయ్య, సలీం, శ్రీనివాస్, స్వామి, భూమన్న పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సత్యదేవున్ని దర్శించుకున్న జడ్జి



దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామిని చెన్నూరు జూనియర్ సివిల్ జడ్జి సంపత్‌కుమార్ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికారు. దర్శన అనంతరం వేదపండితులు తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటం అందించి ఆశీర్వదించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కోటపల్లి: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ మండలంలోని శెట్‌పల్లి, పంగిడిసోమారం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. పంగిడిసోమారం ప్రాథమిక పాఠశాలలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో పక్కన ఉన్న పాఠశాలలో ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. పోలింగ్ బూత్‌ల వివరాలు, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు.

రెండో విడత గొర్రెల పంపిణీ పూర్తిచేయాలి



బాలరాజుకి వినతిపత్రం ఇస్తున్న అశోక్‌యాదవ్

భీమారం: ప్రభుత్వం చేపట్టిన రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్‌యాదవ్ షీప్ అండ్ గోట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజును కోరారు. ఆదివారం హైదరాబాద్‌లో కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గొర్రెల పంపిణీ ద్వారా వేలాది మంది ఉపాధి పొందుతున్నారని తెలిపారు. రెండో విడుతలో మంజూరైన వారికి కూడా సత్వరమే పంపిణీ చేసి న్యాయం చేయాలని కోరారు. వర్షాకాలంలో గొర్రెలు, మేకలకు సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రతీ పశువైద్యశాలకు సీజనల్ వ్యాధుల నివారణ మందులు సరఫరా చేయాలని కోరారు. ఈమేరకు హామీ ఇచ్చినట్లు అశోక్‌యాదవ్ తెలిపారు.

జిల్లాలో 29.8 మి.మీ వర్షం

మంచిర్యాల అగ్రికల్చర్: జిల్లాలో శనివారం రాత్రి నుంచి ఆదివారం వరకు 29.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కోటపల్లిలో 63.3, చెన్నూరులో 47.3, నెన్నెలలో 41.6, కాసిపేటలో 37.2, జైపూర్‌లో 35, వేమనపల్లిలో 37.7, కన్నెపలిలో 33.7, తాండూర్‌లో 33.5, భీమారంలో 32.2, భీమినిలో 29.2, నస్పూర్‌లో 24.4, బెల్లంపల్లి 26.2, మంచిర్యాలలో 22.6, జన్నారంలో 21.1, మందమర్రిలో 19.1, దండేపల్లిలో 18.6, హాజీపూర్ 8.7, లక్సెట్టిపేటలో 7.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. జిల్లాలో సాధారణ వర్షపాతం ఇప్పటి వరకు 317.1 మిల్లీమీటర్లు కురువాల్సి ఉండగా, 277.1 మిల్లీమీటర్లు కురిసింది. జిల్లా సగటున 13 శాతం లోటు వర్షపాతం ఉంది. జైపూర్ మండలంలో 24 శాతం అధిక వర్షపాతం నమోదు కాగా, 11 మండలాల్లో 5 నుంచి 20 శాతం వరకు లోటు వర్షపాతం, 7 మండలాల్లో 20 నుంచి 40 శాతం లోటు వర్షపాతం నమోదైంది.

పేరుకు పోతున్న చెత్తకుప్పలు



బస్టాండు సమీపంలో పేరుకు పోయిన చెత్త

దండేపల్లి: జీపీ కార్మికులు సమ్మెలో ఉండటంతో గ్రామాల్లో చెత్త నిల్వలు పేరుకుపోతున్నాయి. ఎక్కడి చెత్త అక్కడే ఉంటోంది. వానాకాలం కావడంతో, చెత్త కుప్పలపై ఈగలు, దోమలు వాలుతున్నాయి. దీంతో వ్యాధులు ప్రబలుతాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ప్రత్యామ్నాయా చర్యలు చేపట్టి చెత్తకుప్పలు తొలగించాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

పాముకాటుతో మహిళ మృతి

చింతలమానెపల్లి: చింతలమానెపల్లి మండల కేంద్రానికి లోడెల్లి లలిత (53) ఆదివారం ఉదయం పాముకాటుకు గురై మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లలిత తెల్లవారు జామున నిద్ర లేచిన అనంతరం కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇంటి నుంచి బయటకు వెళ్లగా పాము కాటుకు గురైంది. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కౌటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ చికిత్స అందించిన అనంతరం సిర్పూర్(టి) సామాజిక ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతురాలికి భర్త మధుకర్‌తో పాటు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తులసీదాస్ తెలిపారు.

గాయపడిన యువకుడి మృతి


నితిన్ (ఫైల్)

కాగజ్‌నగర్ రూరల్: కాగజ్‌నగర్–పెంచికల్‌పేట ప్రధాన రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన నితిన్ (22) హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మండలంలోని సీతానగర్ గ్రామానికి చెందిన నితిన్ ఆమె తల్లి విమల, బంధువు శేఖర్‌లు మోటారు సైకిల్‌పై వెళ్తూ విద్యుత్ స్తంభాలను తీసుకెళ్తున్న ట్రాక్టర్‌ను రాస్పెల్లి వద్ద ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తల్లి జుమిడి విమల, కుమారుడు నితిన్‌లు తీవ్రంగా గాయపడగా హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి నితిన్ ఆదివారం మృతి చెందారు. దీంతో సీతానగర్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మనస్తాపంతో ఒకరి ఆత్మహత్యాయత్నం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం పడ్తనపల్లి గ్రామంలోని రాంపూర్ గ్రామానికి చెందిన దేవి మహేందర్ అలియాస్ మూర్తి (38) ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం... పడ్తనపల్లి గ్రామానికి చెందిన మూర్తి కూలీ పని చేసుకుంటూ కుటుంబంతో కలిసి జీవిస్తున్నాడు. ఇటీవల తరుచూ భార్యాభర్తల మధ్య వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఆదివారం కూడా భార్యాభర్తల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన మూర్తి గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే 108 ద్వారా మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మంచిర్యాలలోని మరో ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఎలాంటి కేసు నమోదు కాలేదు.

రోడ్డు ప్రమాదంలో పీఈటీ మృతి


చునార్కర్ ప్రహ్లాద్ (ఫైల్)

రెబ్బెన: మండలంలోని కిష్టాపూర్‌కు చెందిన చునార్కర్ ప్రహ్లాద్ (26) పీఈటీ శనివారం రాత్రి బుద్దనగర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్సై భూమేష్ ఆదివారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... కిష్టాపూర్‌లో నివాసం ఉంటే ప్రహ్లాద్ కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలల్లో పీఈటీగా విధులు నిర్వహిస్తున్నాడు. ప్రతి రోజు ఉదయం కిష్టాపూర్ నుంచి కాగజ్‌నగర్‌కు బైక్‌పై వెళ్తుంటాడు. ఈ క్రమంలో శనివారం సైతం ఉదయం తన ద్విచక్ర వాహనంపై కాగజ్‌నగర్ వెళ్లి తిరిగి రాత్రికి ఇంటికి వస్తున్న క్రమంలో మార్గంమధ్యలోని బుద్దనగర్ సమీపంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న మతిస్థిమితం లేని వ్యక్తిని ఢీకొట్టి కింద పడ్డాడు. దీంతో ప్రహ్లాద్ తలకు తీవ్రగాయాలు కాగా స్థానికులకు 108లో బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిక్షించిన అక్కడి వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈమేరకు మృతుడి తండ్రి తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


నరేష్(ఫైల్)

కాసిపేట: మండలంలోని దేవాపూర్‌లో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఖైరి నరేష్(32) మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం... దేవాపూర్ సల్పాలవాగు నుంచి దేవాపూర్ వైపు మోటార్ సైకిల్‌పై వెళ్తున్న నరేష్, సురేష్‌లు అదుపుతప్పి పడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వారిని మంచిర్యాల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి నరేష్ మృతిచెందాడు. సురేష్ చికిత్స పొందుతున్నాడు. లారీ డ్రైవర్‌గా పనిచేసే నరేష్‌కు భార్య కావ్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.


రామకృష్ణాపూర్: బోనాలతో తరలివస్తున్న భక్తులు

సల్లంగ చూడమ్మా..



ఆషాఢమాసం చివరి ఆదివారం కావడంతో శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, భక్తుల భావోద్వేగాల నడుమ బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆయా మైసమ్మతల్లి, పోచమ్మతల్లి ఆలయాల వద్ద భక్తులతో సందడిగా మారింది. పిల్లపాపలను, పశుపక్ష్యాదులను సల్లంగా చూడాలని వేడుకున్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మంచిర్యాల జిల్లాలోని గాంధారి ఖిల్లా మైసమ్మ తల్లి దర్శనానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. – సాక్షి, నెట్‌వర్క్


నస్పూర్: పోతురాజుల విన్యాసాలు


రామకృష్ణాపూర్: బోనమెత్తుకుంటున్న యువతి


నస్పూర్: పోతురాజుల విన్యాసాలు, బోనాలతో భక్తులు


నస్పూర్: బోనంతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు


నస్పూర్: ఆలయంలో డీసీసీ అధ్యక్షురాలు సురేఖ


రామకృష్ణాపూర్: అమ్మవారిని దర్శించుకుంటున్న డీసీపీ, సీఐ


రామకృష్ణాపూర్: బోనమెత్తుకుని వస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్


రామకృష్ణాపూర్: దర్శనానికి బారులు తీరిన భక్తులు


కౌటాల: బోనాలతో మహిళలు


రామకృష్ణాపూర్: గాంధారి మైసమ్మ ఆలయంలో ఎమ్మెల్యే దివాకర్‌రావు


చెన్నూర్: బోనాలతో తరలిన గ్రామస్తులు


చెన్నూర్: బోనాలతో భక్తులు


మందమర్రిరూరల్: నృత్యాలు చేస్తున్న యువతులు

పదోన్నతులు సరే.. పోస్టింగులేవి..!

- 26రోజులు గడిచినా పోస్టింగ్ కోసం డీఎస్పీల ఎదురుచూపులు
- ఉమ్మడి ఆదిలాబాద్‌లో ఒక్కరికి, రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో ఇద్దరికి పదోన్నతి



మంచిర్యాలక్రైం: తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పోలీస్ శాఖకు పెద్దపీట వేస్తోంది. పోలీస్‌స్టేషన్ల నిర్వహణ ఖర్చులు, ఆధునాతనమైన వాహనాలు, పెట్రోల్ అలవెన్స్‌లు భారీగా పెంచింది. దీంతో పాటు ఎప్పటికప్పుడు పోలీస్ అధికారుల పనితీరు, సీనియార్టీని బట్టి పదోన్నతులు కల్పిస్తోంది. గత ప్రభుత్వాల కాలంలో అధికారులు పదోన్నతుల కోసం ఎదురుచూసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అయితే తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సీఎం కేసీఆర్ గత నెల 22న రాష్ట్ర వ్యాప్తంగా కొంతమంది సీఐలకు సీనియార్టీ ప్రకారం డీఎస్పీగా పదోన్నతులు కల్పించింది. ఇందులో రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు సీఐలకు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఒక్కరికి పదోన్నతి లభించింది. కానీ 26 రోజులు గడిచిన ఎక్కడ పోస్టింగ్ ఇవ్వక పోవడంపై అధికారుల్లో అసంతృప్తి నెలకొంది. పదోన్నతి కల్పించి పోస్టింగ్ ఇవ్వకపోవడంతో కనీసం పదోన్నతితో పాటు పెరిగిన వేతనం ఇస్తారో లేదోనని చర్చించుకోవడం గమనార్హం. ఇప్పటికే పోలీస్ శాఖలో పని చేస్తున్న అధికారులకు వేతనాలు సరైనసమయంలో అందించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే విమర్శలున్నాయి. దశాబ్ది ఉత్సవాలను పురష్కరించుకొని ఆగమేగాల మీద పదోన్నతులు కల్పించింది కాని ఎక్కడ డీఎస్పీ పోస్టుల ఖాళీ లేకపోవడంతో పదోన్నతులు పొందిన వారికి ఎక్కడ పోస్టింగ్ ఇవ్వాలో అధికారులకు తలనొప్పిగా మారింది.

అపూర్వ సమ్మేళనం


మంచిర్యాలఅర్బన్: పూర్వ విద్యార్థులు 26ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం మేద కళాశాల 1996–98 ఇంటర్ సీఈసీకి చెందిన పూర్వ విద్యార్థులు ఒకేచోట కలుసుకుని ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా లెక్చరర్లు మధు, మహేందర్‌లను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో బేతి సత్యనారాయణ, రాజిరెడ్డి, చంద్రశేఖర్, దుర్గయ్య, ప్రవీణ్, పూర్ణచందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నూతన నియామకం


నియామక పత్రం అందుకుంటున్న సల్మాన్ షేక్

మంచిర్యాలటౌన్: జాతీయ బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మంచిర్యాలకు చెందిన సల్మాన్‌షేక్‌ను నియమిస్తూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య ఆదివారం నియామక ఉత్తర్వులను హైదరాబాద్‌లో అందించారు. ఈ సందర్భంగా సల్మాన్ షేక్ మాట్లాడుతూ బీసీ విద్యార్థి సంఘం తరుపున విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తామన్నారు.

రైతుపై బీఆర్‌ఎస్ నాయకుడి దాడి..

- ధాన్యం కోతపై ప్రశ్నించినందుకు..


గాయపడిన రైతు ముత్తయ్య..

దండేపల్లి: ధాన్యం కోతపై ప్రశ్నించిన ఓ రైతుపై బీఆర్‌ఎస్ నాయకుడు దాడిచేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని కాసిపేటలో ఎమ్మెల్యే దివాకర్‌రావు తనయుడు విజిత్‌రావు బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆదివారం గడపగడపకూ బీఆర్‌ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన రైతు జంగిలి ముత్తయ్య వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో 47 బస్తాల ధాన్యం విక్రయిస్తే, 40 బస్తాలకు మాత్రమే డబ్బులు వచ్చి, మిగిలిన 7 బస్తాల డబ్బులు రాక పోవడంతో ఈ విషయాన్ని నాయకులతో పాదయాత్రగా వస్తున్న విజిత్‌రావు దృష్టికి తీసుకెళ్లే క్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు స్థానిక వార్డు సభ్యుడు, కొనుగోలు కేంద్రం నిర్వాహకుడు కోడి రాజేష్ రైతు ముత్తయ్యపై దాడి చేసి పిడిగుద్దులు గుద్ది తోసేయడంతో స్పృహ కోల్పోయి కిందపడిపోయాడు. వెంటనే స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం లక్సెట్టిపేట ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం మంచిర్యాలకు రెఫర్ చేశారు. తన భర్తపై దాడికి పాల్పడిన వ్యక్తిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, ముత్తయ్య భార్య బాగ్యలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా ఈవిషయమై ఎస్సై ప్రసాద్‌ను సంప్రదించగా ఫిర్యాదు వచ్చిందని, మెడికల్ రిపోర్ట్ ఆధారంగా కేసు నమోదు చేయనున్నట్లు తెలిపాడు. రైతు పై దాడి ఘటనను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖండించారు.

కుటుంబీకుల చెంతకు వృద్ధుడు


కుటుంబీకులకు అప్పగిస్తున్న పోలీసులు

సిరికొండ: మూడు రోజుల క్రితం బంధువుల ఇంటికి వెళ్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన వృద్ధుడు మతిస్థిమితం కోల్పోయి సిరికొండకు చేరాడు. వివరాలలోకి వెళితే.. కరీంనగర్ జి ల్లా రామడుగు మండలం రామచంద్రపురం గ్రామనికి చెందిన చెల్ల రాజయ్య(72) గురువారం ఇంటి నుంచి బంధువుల ఇంటికి వెళ్లానని బయటకు వచ్చాడు. మతిస్థిమితం కో ల్పోయి మండలంలోని సిరికొండకు ఆదివా రం ఉదయం చేరుకున్నాడు. గ్రామంలో తిరుగుతూ కనిపించడంతో స్థానికులు గమనించిన సర్పంచ్ సర్పంచ్ ఓరగంటి నర్మదకు స మాచారం అందించారు. దీంతో సర్పంచ్ వివరాలు సేకరించి పోలీసులకు అప్పగించింది. పోలీసులు ఆరా తీయగా చివరికి గ్రామం వి వరాలు తెలిపాడు. ఆ వివరాలతో రామడుగు మండల పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో రామడుగు పోలీసులు రాజ య్య కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో సిరికొండ చేరుకున్న రాజ య్య కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో రాజయ్య కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె గ్రామశివారులో పేకాటాడుతున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్.శంకర్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడి చేసి పేకాటడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3910 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.